

కాగితం, కలం తీసుకొన్నాను మామయ్యకు ఉత్తరం రాయాలని. కానీ కలం సాగడంలేదు. ఏమని రాయాలి? ఎలా రాయాలి?

మామయ్యకు తీరని అన్యాయం జరిగిన మాట నిజమే.

ఆ దెబ్బ నుండి మామయ్య ఇప్పుడప్పుడే కోలుకోలేడన్నది నిజమే.

కానీ ఉపశమనంగా నాలుగు మాటలతో ఉత్తరం రాస్తే చాలు. తన కష్టంలో ఒకరు కూడా పాలుపంచుకొంటున్నారనే ఊహే మనిషికి మానసికంగా కొంత బలాన్ని చేకూరుస్తుంది, అనుకొని, కానీ ...

ఏం రాయాలి?

ఇంతకు ముందెప్పుడూ ఇలా రాసిపెట్టి లేదు, రాయవలసిన అవసరం లేకపోయింది. కానీ ఈ నాడు రాక తప్పదు.

మామయ్య నాకు కేవలం మామయ్యే కాదు, నాన్న పోయిన దగ్గర్నుంచీ నా తండ్రి — ఈ నాటికీ ప్రాణప్రదమైన ఆత్మీయుడు కోల్పోయాడు శాశ్వతంగా!

అసలే గుండె జబ్బు మనిషి. ఈ ఆఘాతం నుండి ఎలా తట్టుకొని ఒడ్డున చేరతాడో తెలియదు. అలాటి మామయ్యకు ఈ సమయంలో ఏమని ఉత్తరం రాయాలి? ఎలా రాయాలి?

మామయ్యా, నీ కన్యాయం జరిగింది, అని రాయనా?

నిన్ను దేవుడు మోసంచేశాడు, అని రాయాలా? అత్తయ్య నిన్ను అన్యాయం చేసింది, అని రాయాలా?

ఇద్దరు ఆడపిల్లల గతి ఏమై పోతుంది? ఏమిటిలా జరిగింది?

ఏమీ పాలుపోవడం లేదు.

పోనీ ... ఒక్కసారి వెళ్ళి వస్తే ...

నిజమే, ఒక్కసారి వెళ్ళివస్తేమంచిది. వ్యక్తిగతంగా పరామర్శించటంలోనే మనిషి ఎక్కువైనా ఎవరటి వారి కష్టంలో పాలు పంచుకో గలుగుతాడు.

మరునాడే బయలుదేరాను. నాలుగు వందల మైళ్ళ ప్రయాణం ఎలా జరిగిపోయిందో నాకే తెలియక, తరవాత రోజుకు సామర్లకోటకు చేరుకున్నాను.

ఇంటికి వచ్చాను భయపడుతూ — ఎలాటి దృశ్యాన్ని, ఎలాటి పరిస్థితిని, ఎంతటి భయంకర వాతావరణాన్ని ఎదుర్కోవలసి వస్తుందో అనుకుంటూ,

ఇంట్లో చావు తరవాత నిశ్శబ్దం తాండవిస్తోంది. ఆ నిశ్శబ్దంలో ఉన్న విచారం, గాంభీర్యం భయం కలగజేస్తున్నాయి. ఆ భయాన్ని అనుభవించగలగటం నిజంగా దురదృష్టం.

ఒక్క మనిషి లేకపోయే సరికి ఆ

లంకంత ఇల్లూ జీవం కోల్పోయింది. బావురుమంటూ మనుషులతోబాటు, మనసులతోబాటుగా ఆ ఇల్లూ ఏడుస్తూంది. నిజమేమరి, ఈ నాటి అనుబంధమా అది? మనుషులెవరూ లేని ఇల్లు నన్ను చూసి దిగాలుగా నిలబడి పోయింది.

ఆ నిశ్శబ్దానికి బిక్కచచ్చిపోతూ మెల్లిగా అడుగులతో అడుగులేస్తూ లోనికి వెళ్ళాను. ఏ గదిలోనూ ఎవరూ ఉన్నట్లు లేరు. వంట ఇంట్లోంచి ఏదో చప్పుడు వినిపిస్తూంది. మెల్లిగా అటు వెళ్ళాను.

కుంపటి మీద ఏదో గిన్నె ఉంది. కుంపటి విసురుతూంది ఇందిర!

అడుగుల చప్పుడు విని తల ఎత్తి చూసింది.

"బావా!" తుపానులాగ ఒక్కసారి నన్ను చేరి బావురుమంది. 'బావా!' ఏదో చెప్పబోయి వెక్కిళ్ళతో చెప్పలేకపోయింది.

"ఊరుకో ఇందూ ... ఊరుకో ... ఏడవకు మరి — "

ఇంతకన్న ఏమనాలి? —

శోకం అంతా ఒక చోటనే పోగు పెట్టినట్లున్న ఇందిరను చూస్తుంటే, ఆ శోకంలో పాలు పంచుకోవాలనేదే నా తాపత్రయం.

కానీ, ఎంతయినా ఇందిరకు అమ్మ.

అమ్మ జీవితంలో ఎవరూ కోల్పో కూడని దేవత.

అలాటి దేవతను కోల్పోయింది ఇందిర.

ఈ ఆపత్సమయంలో ఇందిర నా నుంచి తోటి మనిషిగా సానుభూతి కోరుకుంటూంది. ఎంతో చెప్పాలని ఉంది. ఏమీ చెప్పలేని స్థితి.

స్వరపేటికకు దుఃఖం అడ్డుపడింది.

పలకబోయిన నాలుగు పదాలకు ఆత్మీయత అడ్డువస్తూంది.

ఇందిరే ఇంతబేలగా మారి శోకంతో నిండిపోతే ఇందిర చెల్లెలు వసంత సంగతి ఎవరు చెప్పగలరు?

అది ఇంకా చిన్నపిల్ల. ఇందిరకన్న దాదాపు ఎనిమిదేళ్ళు చిన్న. అమ్మ ఒడిని వదిలి ఉండలేని వయస్సు దానిది. ఇంత చిన్న వయసులోనే అది ఆ అదృష్టాన్ని పూర్తిగా కోల్పోయింది.

అయినా వసంత ఏది?

ఇందిర వెక్కివెక్కి ఏడుస్తూంది భుజంమీద పడి. ఈ సమయంలో అసలు ఆలోచన కూడదు. అనునయం తప్ప.

"లే ... ఊరుకో ... ఇందూ, నా మాట వినవూ ..."

ఎలా వినగలదు నా మాట?

ఎంతటి దుఃఖం ఇది!

ఎంతటి బాధ ఇది! ఎలా వినగలదు నా మాట?

"ప్లీజ్... వినాలి మరి ..."

"బావా" ఏదో చెప్పబోయి ఎక్కిళ్ళ వల్ల ఆగిపోయింది.

"తరవాత చెబుదువు గానిలే ... ఊరుకో మరి."

ఇందిర ఎక్కిళ్ళను ఉన్నట్లుండి ఆపేసింది. ఒక్కసారి తల ఎత్తి నాకేసి చూసింది.

"ఎవరో వస్తున్నారు గదా?"

ఆశ్చర్య పోయాను ఈ హఠాత్పరిణామానికి.

నేనిది ఊహించలేదు.

జాగ్రత్తగా ఆలకించాను, అడుగుల సడి వినవస్తున్న మాట నిజమే!

"ఆ — ."

అంతే, ఇందిర పరుగున వెళ్ళి కుంపటి ముందు వాలిపోయింది. పైట చెంగుతో కన్నీటిని తుడుచు కొంది ఆత్రతతో. ఎక్కిళ్ళను ఆపుకో ప్రయత్నిస్తూంది. శతవిధాలా. అయినా అవన్నీ వ్యర్థ యత్నాలే అవుతున్నాయి.

వచ్చింది మామయ్య, వసంత ప్రభృతులు. మిగతా వాళ్ళు నాకు తెలీదు. వారి రాక ఏదో సానుభూతి వాక్యాలు అందించటానికి కాబోలు!

ఇందిరకేసి చూశాను, సీరియస్‌గా పనిలో నిమగ్న అయింది.

ఆశ్చర్యపోవటం మినహా ఇంకేమీ చేయలేక పోయాను.

అయినా ఏమిటిది?

కన్న తల్లి చనిపోయింది, అయిన వారితో కష్టాన్ని చెప్పుకుని, వారినుండి ఆత్మీయత నిండిన రెండు వాక్యాలు కోరుకోవటంలో తప్పేముంది?

పైగా ఇందిర చూపులో భయం! ఎందుకో?

"బావా! ఎప్పుడు వచ్చావురా?" వసంత పలకరింపుతో ఆలోచనలు ఆగిపోయాయి.

నవ్వాలనే యత్నం నాలోనే అణగారి పోయింది.

మామయ్యను చూశాను, పలకరించాలనే యత్నం చేయబోయాను. అదీ విఫలమయి పోయింది.

"ఏరా! కులాసాగా ఉన్నావా?"

మామయ్యనుండి నే నాశించింది ఇది కాదు. ఇంత మామూలుగా ఎలా ప్రశ్నించ గలుగుతున్నాడు?

ఛ, ఏదో అపస్వరం, ఎందుకో తెలియదు, ఎక్కడినుండో వినిపిస్తూనే ఉంది.

చావు నిజంగా ఇంత భయంకరమా?

మామయ్య ఇదే ప్రశ్న ఇంకో సందర్భంలో వేసి ఉంటే నాకీ అనుమానమే వచ్చేది గాదు. ఏదో విధంగా ఈ ప్రశ్న జవాబును పొందగలిగేది.

అయినా మామయ్య ఇంత మామూలుగా ఎలా అడగ గలిగాడు?

ఏదో అపశ్రుతి భయంకరంగా వినిపిస్తూంది.

అత్తయ్య అకాల మరణం.

ఇందిర అకారణ భయం!

మామయ్య అకాలపు కుశల ప్రశ్న!

ఏదో విషవలయం ఉందనిపిస్తూంది.

'ఛ, ఉండి ఉండదు.

ఇది కేవలం మృత్యువు చేసిన వికటాట్టహాసపు ప్రతిధ్వనే తప్ప మరేదీ కాదు.

'ఇది నిశ్చయంగా చావు కలిగించే భయమే తప్ప ఇంకేమీ కాదు —' అని అనుకోవాలనుకున్నా, అత్మ వంచనకు నా మనస్సు సిద్ధంగా లేదనే సంగతి నే నెరిగిన సంగతే!

ఇందిర అందిచ్చిన కాఫీ తీసుకున్నాను. వేడి కాఫీ గొంతులో పోసుకునేసరికి మరో వేయి ప్రశ్నలు మస్తిష్కంలో తల ఎత్తాయి.

అన్ని ప్రశ్నలకు సమాధానం ఇప్పుడే దొరకదు.

వేచిచూస్తే, క్షణం గడిస్తే, ఈ ముడికట్లను కాలమే విప్పుతుంది.

కాఫీ తాగి, ఇందిర నా కోసం వేసిన మంచం మీద నడుం వాల్చాను. నాకు తెలుసు, ఇదేం బాగాలేదు. బద్ధకం తీర్చుకోడానికి ఇది సమయం కానేకాదు.

కానీ అలా జరుగుతోంది!

ఇదంతా ఎలా అర్థం చేసుకోవడం?

విధి అని సరిపెట్టుకోవడమే?

అంతకన్న ఈ క్షణంలో ఇంకోటి తోచడం లేదు మరి.

---

**భార్యాభర్తల మధ్య గొడవ రాకూడదనికాదు. రాదనీ కాదు. వస్తుంది. కాని ఒకళ్ళు కాక పోతే ఒకళ్ళు ఓర్పు, సహనం చూపాలి. అప్పుడే ఆ బంధానికి అర్థం ... ఏమైనా క్షమించడంలోనే శిక్షించడం కూడా ఇమిడి ఉందని తెలుసుకొనడం ఎలాగ?**

---

పోనీ సెలవైనా పెట్టకూడదా అని.

"ఎంతకాలం సెలవు తీసుకోనురా? — పోనీ సెలవు తీసుకొన్నా లోటు తగ్గిపోతుందా? ఇంటివద్దనే ఉంటే ఇంకొంచెం బాధ ...

నిజమే!

ఇంట్లో అణువణువూ అత్తయ్యను జ్ఞాపకం చేస్తూంది. ఈ జ్ఞాపకాల నుండి తప్పించుకోవాలంటే ఇదే మార్గమేమో!

మామయ్య ఆఫీసుకు వెళ్ళిపోయాడు. మామయ్య మెట్లు దిగగానే తలుపు వేసేసింది ఇందిర.

"బావా! నాకు భయంగా ఉంది బావా!" రాబోయే ఎక్కిళ్ళను ఆపు కొంటూ అంది.

ఇందిర మాటలేవీ నా కర్థంకాలేదు.

"భయమా? ఎందుకే అర్థం లేకుండా?"

# మనిషి - మరో శిఖరం

**— పాలకోడేటి సత్యనారాయణరావు**

ఆ రోజు గడిచింది ఎలాగో.

మరునాడు ఉదయమే మామయ్య ఆఫీసుకు తయారయ్యాడు.

నేను ఆశ్చర్యపోయాను, చావును ఇంత నిర్లక్ష్యంగా చూడగలిగిన వ్యక్తి నా కింతవరకూ ఒక్క మామయ్యే కనిపించాడు.

ఇది నిర్లక్ష్యమే అనాలా?

లేకపోతే వైరాగ్యమే అనాలా?

ఏమో ఏదైనాగాని ఇది ఆశించదగ్గ మార్పు మాత్రం కాదు.

అందుకే అడిగాను మామయ్యను

అటూ ఇటూ చూసిందొక సారి ఇందిర.

ఆ చూపులో భయం.

ఆ చూపులో ఆందోళన.

ఒకసారి ఇందిరకేసి చూశాను. కను కొలకులలో నిండిన నీరు తళుక్కున మెరిసింది. ఆ మెరుపులో ఆ కన్నీటి వెనక దాగిన భయం, ఆందోళన, బాధ అన్నీ ఒక్కసారి ఓ వెలుగు వెలిగాయి.

"ఎలా చెప్పను బావా నీకు? నా బాధ చెప్పుకునేది గాదు... "

ఏమిటి ఇందిర అనేది?

ఇందిర బాధ చెప్పుకునేది గాదా? అత్తయ్య చావుకు ఇందిరే కారణమా?

ఇందిర యౌవనంలో ఉంది — కాలు జారితే ...

ఛ, ఎంత అసభ్యంగా ఉన్నాయి నా ఆలోచనలు!

"చెప్పు ఇందిరా — చెపితే సగం బాధ తీరిపోతుంది."

బహు పేలవంగా నవ్వింది ఇందిర— "చెబితే తీరేబాధ గాదు బావా ఇది! నిజం చెప్పాలంటే చెప్పుకుంటేనే అధికమవుతుంది."

"ఏమిటో ఇందిరా అంతా అయోమయంగా ఉంది."

"నిజం బావా! అంతా అయోమయంగానే ఉంది. ఏది ఎందుకు జరుగుతూందో ఏమీ తెలియడం లేదు."

ఇందిరను అపుతూ అన్నాను — "చూడు ఇందూ, సరిగా చెపితే, చెప్పు లేకపోతే లేదు గానీ ఉపోద్ఘాతం ఇంక మానెసెయ్."

ఇందిర నాకేసి చూసింది. "ఇంత వరకు ఎవరితోను చెప్పుకోలేదు బావా, అసలిది ఒకరితో చెప్పేది గాదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే బావా, అమ్మ చావు సాధారణంగా జరిగింది గాదు, అమ్మను చంపేశారు ..." వెక్కివెక్కి ఏడ్వసాగింది ఇందిర.

ఉలికి పడ్డాను నేను.

నేను నిజమే వింటున్నానా?

అత్తయ్యను చంపేశారా?

ఎవరు? ఎందుకు? ఎలా?

అసలు అత్తయ్యకు ఎవరు ద్రోహం తలపెట్టగలరు?

అత్తయ్యతో పరిచయమున్న ప్రతివారు అత్తయ్యలో ఉన్న మాతృత్వ మమతల మాధుర్యాన్ని చవిచూడ గలరే తప్ప ...

అత్తయ్యకు కూడా శత్రువు లుంటారనేది నేను నమ్మలేను.

"ఇందిరా, నమ్మమంటావా?"

"నమ్మలేవు బావా ... అసలు నేనే నమ్మలేదు ... కాని ఇది నిజం... అమ్మ చావు నాన్న చేతిలోనే ..." ఎక్కిళ్లతో మాట పూర్తి చేయలేక పోయింది ఇందిర.

ఇందిర మాట పూర్తి చేయలేదు గాని అర్థం అయిపోయింది నాకు.

కాని ఇది అసంభవం, హాస్యాస్పదం కూడాను.

అత్తయ్యను మామయ్య చంపడం ...ఛ!

"ఇందిరా, నువ్వు చూశావా?" చూసి ఉండదనే ధీమాతో అడిగాను.

"ఆ, పాలు తీసుకువెళ్లటం నాకు బాగా తెలుసు ..."

వసంత రావటంతో ఠక్కున ఆపేసింది ఏదో చెప్పబోయిందల్లా. "అక్కా, అన్నం పెట్టవే"

"వస్తా బావా, దీనికి అన్నం పెట్టి" "వెడుతూ వెడుతూ ఆగిపోయి అంది ఇందిర — "బావా! ఎక్కడా నోరు జారకు, ప్లీజ్ ..."

తల ఊపాను సరేనన్నట్లు.

ఏమిటి ఈ ఇందిర కథనం?

ఇలా జరుగుతుందా ఎక్కడైనా?

నమ్మశక్యం కాకుండా ఉంది — మామయ్య అత్తయ్య కలిసి సుమారు ఇరవై సంవత్సరాలనించీ కాపురం చేస్తున్నారు. మామయ్య అత్తయ్యను పల్లెత్తు మాట అనగా నే నెప్పుడూ వినలేదు. అత్తయ్య అంటే మామయ్యకున్న ఆ ప్రేమ, ఆ ఆదరణ, ఆ అనురాగం ఎక్కడో కానీ లోకంలో చూడము!

కానీ ఈ ఇందిర ఏం చెబుతోంది?

వెలుగు వెనకనే నీడ, ప్రేమచాటునే ద్వేషమా?

ద్వేషం ఉన్నా కానీ ఇంత అధికంగానా?

హత్యచేయవలసినంత అవసరం కలిగిందా?

ఏమో,

మళ్లీ వెళ్లి ఇందిరను చేరాను. నన్ను చూడగానే పీట వేసింది ఇందిర. గారాబు చేస్తున్న వసంతకు ఏవేవో కబుర్లు చెబుతూ అన్నం పెడుతూంది.

"చెప్పు ఇందూ ..."

"ఏం చెప్పను? వసంత ఉంది, మళ్లీ చెబుతాలే ..." అంది ఇందిర ఇంగ్లీషులో.

"ఫర్వాలేదు, ఇంగ్లీషులోనే చెప్పు" అన్నాను నేను.

ఒక్కసారి నా కేసి చూసి చెప్ప నారంభించింది — "అంత క్రితం ఏం జరిగిందో నాకు తెలియదు బావా — నే నప్పుడే వైదేహి వాళ్ల ఇంటికి వెళ్లి వచ్చాను. వైదేహి తెలుసుగా నీకు?"

"ఆ రిటైర్డ్ జడ్జీగారమ్మాయేగా?"

"ఔను, ఆవేళ వైదేహి వాళ్లన్నయ్య కూతురి పుట్టిన రోజు అని మధ్యాహ్నమే వచ్చి పేరంటానికి పిలిచి వెళ్లారు. వెళ్లాలనే కాంక్ష లేకపోయినా, అమ్మ వెళ్లకపోతే బాగుండదని మరి మరీ అంది. ఇలాంటి విషయాలలో సాధారణంగా జోక్యం కల్పించుకుని ఎరగని నాన్న కూడా ఆ నాడు వెళ్లమనే అన్నాడు. ఔను బావా, అన్నట్లు ఆవేళ నాన్న సెలవు పెట్టారు. వైదేహి వాళ్ల ఇంటికి వెళ్లాను. వెళ్లి వెంటనే తిరిగి వచ్చేశాను, కానీ ..."

"కానీ నువ్వు తిరిగి వచ్చే సరికి అంతా అయిపోయింది, ఔనా?"

తల అడ్డంగా ఊపి అంది ఇందిర. "లేదు, అసలు అప్పటికి ఏమీ జరగలేదు. ఇంటికి వచ్చి రాగానే, నాన్నే అన్నారు సినిమా టిక్కెట్లు రెండున్నాయి. మీ ఇద్దరూ — అంటే నేను, వసంత అన్నమాట, వెళ్లిరండి అంటూ. మా ఇద్దరినీ తొందరపెట్టి మరీ సినిమాకు పంపేశారు నాన్న. అంత జరుగుతుందని తెలిస్తే అసలు వెళ్లకనే పోదును ..."

అక్కా, చెయ్యి కడుగుతావా లేదా?"

ఉలికిపడ్డాం ఇద్దరమూ. మౌనంగా వెళ్లి చెయ్యి కడిగింది. ఇందిర. వసంత వెళ్లిపోయింది.

"ఇంటికి తిరిగి వచ్చేసరికి పది అయింది బావా — రాగానే అన్నారు నాన్న భోజనం పెట్టమని..."

"అప్పటికి భోజనం కాలేదా ఇంకా?"

"అదే బావా — ఎప్పుడు సినిమాకు వెళ్లినా ముందే భోజనం చేసేవారుగదా, ఆవేళ ఇంకా చేయక కూర్చున్నారు, పైగా అమ్మ భోజనం కూడా చేయనంది ఆవేళ — నాన్న అమ్మను భోజనం చేయమని కూడా అనలేదు. కానీ, భోజనం అయ్యాక మేం ఇద్దర్నీ కడుక్కుంటు ఉంటే నన్ను పాలు కాచి ఇవ్వ మన్నారు, ఇచ్చాను. తీసుకువెళ్లారు గ్లాసుతో — అదీ సంగతి —"

నాకు నిజం చెప్పద్దూ, ఇందిరను చూస్తే జాలేసింది.

భార్యాభర్తల మధ్య గొడవ రాకూడదని కాదు, రాదనీకాదు. వస్తుంది, కానీ, ఒకళ్లు కాకపోతే ఒకళ్లు ఓర్పు సహనం చూపితీరాలి. అప్పుడే ఆ బంధానికి ఒక అర్థం. బహుశా ... అత్తయ్య ఆగ్రహంలో ఉంటే ఉపశమనానికి, రాజీకి మామయ్య పాలు తీసుకువెళ్లాడేమో?

అదే అన్నాను ఇందిరతో.

ఇందిర మాత్రం నా మాట ఒప్పుకోలేదు. తల అడ్డంగా తిప్పుతూ అంది ఇందిర "నేను ఒప్పుకోను బావా! ఆ తరవాత ఏం జరిగిందో నీకు తెలియదు. పూర్తిగా వినకుండానే నీ ఇష్టం వచ్చినట్లు అనేస్తావు ... లోపలికి వెళ్లగానే తలుపు వేశారు, ఆ తరవాత ఇద్దరూ గొడవపడ్డారు."

"గొడవ అంటే?"

బాధగా అంది ఇందిర — "ఎలా బావా చెప్పడం? అమ్మను నాన్న కొట్టారు కూడా. పాలుతాగు, తాగితీరాలి అంటూ బలవంతం చేశారు, అమ్మేమో 'పాలు తాగనే తాగను, మీరే ఇలా అన్నాక ఎందుకింకా ఇవ్వీ నాకు, ఇలాగే చావ నివ్వండి' అంటూ ఏవేవో వాగింది. నాన్నకూడా ఫర్వాలేదులే, పాలు తాగినా చస్తావులే, తాగు. తాగే చద్దువుగాని చావవలసి ఉంటే ..." అంటూ ఎన్ని తిట్టారో లెక్కలేదనుకో ... ఏమయితే నేం, దాదాపు ఒంటిగంటదాకా గొడవ పడుతూనే ఉన్నారు ఇద్దరూనూ. అంత సేపున్నా అసలేం జరిగిందో నాకు అర్థం గాలేదు. అమ్మమాత్రం "మీ రిలా అన్నారు కనక చస్తా ..." అని మాత్రమే అనేది" చెప్పడం మానేసి బాధగా నిట్టూర్చింది ఇందిర.

ఏమిటో నాకు అర్థం కాలేదు. ఇందిర చెప్పేది నమ్మాలో, నమ్మకూడదో తెలియడం లేదు.

గొంతు పెకలించుకొంటూ అన్నాను నేను "అయితే ఇందూ, అంతా నీ

**పందెం**

చిత్రం—పి. జయశ్రీ (గుంటూరు)





**లోయలోని దారి** — ఫోటో—సి. ఎస్. రావ్ (భోపాల్)

'ఈ పేగాపీ, నమ్మడానికి శక్యంకలిగేలా లేదు."

"లేదు బావా లేదు, నువ్వు నమ్మ లావు, నమ్మడానికి ఆస్కారం లేదనకు, చూపిస్తాను ఉండు." అంటూ లేచింది ఇందిర. నేనూ అనుసరించాను.

మామయ్య పెట్టె దగ్గరకు వెళ్లి ఆగింది ఇందిర. క్షణం ఆగి అంది— "సారీ బావా" అంటూనే మేకుతో తాళం తీసేసింది.

ఆశ్చర్యపోయాను, ఇందిర హస్తలాగు వానికి!

ఇందిరకు ఇన్ని విద్యలు ఎలా తెలి సాయి?

భయం, అనుమానం, మనిషికి ఎన్నో పాఠాలు నేర్పుతాయన్న మాట!

కానీ, ఈ భయం, ఈ అనుమానం మనిషికి పాఠాలయితే నేర్పుతాయిగానీ మనిషి దీనివల్ల కోల్పోయే ఎప్పుడు మాత్రం అమూల్యమయినది.

మానవత్వమే కోల్పోవలసి వస్తుంది ఈ భయం వల్ల.

మనిషిని నమ్మటంలో నీకు నమ్మకం లేకపోతే మనిషిగా ముందడుగు సాగించగలిగితే అర్హత ఉండదు నీకు. తోటి మనిషిని ప్రేమించటం చేతకాకపోతే కాకపోవచ్చు గానీ, అందుకని ద్వేషించడం మాత్రం కూడనిపని.

క్షమార్హం కూడా కాదది.

"ఇది చూడు బావా! —" అంది ఇందిర మామయ్య డైరీని తీసిచూపిస్తూ.

చూశాను ఒకటే ఒక వాక్యం "అను కున్నంతా అయిపోయింది."

ఇందిరవేపే చూశాను ఆ వాక్యానికి భాష్యం చెప్పమని.

నవ్వింది నా అమాయకత్వానికి — నీ కీమాత్రం తెలియదా అన్నట్లు.

"అమ్మపోయిన తరవాత రోజున రాసింది ఇది — అర్థమయిందా?"

తల ఊపాను గానీ నిజానికి ఏమీ అర్థం కాలేదు.

అసలు ఇందిరకు ఈ అనుమానం ఎందుకొచ్చింది.

ఇందిర చూపే ఏ కారణం సరి అయినదిగా అనిపించటం లేదు. అయినా ఇందిరచెప్పేవిధానం, ఆభయాందోళనలూ చూస్తే ... ఏమిటో ...

నా కింకా మనిషిలోని మానవత్వం మీద నమ్మకం సడలిపోలేదు.

దానవత్వంమీద గురిఏర్పడటంలేదు.

"బావా అన్నట్లు మర్చే పోయాను, భోజనం చేస్తావా?"

"వెళ్లి వడ్డించు, నే వస్తాను ..." ఇందిర వెళ్లిపోయింది.

ఎందుకో మామయ్య పెట్టె అంతా చూడాలనిపించింది మౌనంగా అన్నీతీసి చూడనారంభించాను. ఏవేవో కాగితాలు అన్నీ చూశాను వివరంగా. అన్నిటికన్న నన్నాకర్షించింది ఒక్కటే ఉత్తరం. చదివాను —

అదే కారణం, అంతే!

ఇందిర అన్నది అక్షరాల నిజం.

మామయ్య హత్యచేశాడు.

ఇక అనుమానం లేదు, అత్తయ్య చంపబడింది. కానీ ఇందిర ఈ ఉత్తరం సంగతి అసలు చెప్పదేం? తెలీదా?

"ఇందూ, మాట—"

పరుగున వచ్చింది ఇందిర — "అబ్బ, హడలిపోయాను బావా ఏమిటోననుకొని — అయినా భయం ..."

"ఇది చూడు — " అంటూ ఉత్తరం అందించాడు ఇందిరకు.

"ఏమిటిది?" అంటూనే ఉత్తరం తీసికొంది. "అమ్మనా?"

"కాదు — పైకి చదువు."

నా కేసే చూడకుండానే తల ఊపి పైకి చదవ నారంభించింది ఇందిర.

"డియర్ రాజా,

దాదాపు ఇరవై ఏళ్ల తరవాతననుకుం టాను నీకీ ఉత్తరం రాస్తున్నాను.

నీ అడ్రసు కోసం ఎంత పాటుపడ్డానో ఆ దేవుడికే తెలియాలి. మొన్న అనుకోకుండా నా చిన్న నాటి స్నేహితుడు రామమూర్తి కనిపించటంతో నీ గురించిన విశేషాలు అన్నీ తెలిశాయి. పెళ్లయిందట గదూ? కంగ్రాచ్యులేషన్స్. కానీ ఒకటే బాధ — నా ఇల్లాలు కావలసినదానివి. ఇంకొకరి ఇల్లాలైనావు.

ఈ నా డనిపిస్తోంది రాజా—నే నానాడు పారిపోవటం మంచిపనే చేసినట్లయింది. లేకపోతే అబ్బ! తలచుకోవాలంటే భయంగా ఉంది. పారిపోయి తిరిగి రావాలనే, తిరిగి వచ్చి నిన్ను నా దాన్నిగ చేసుకోవాలనే ఆకాంక్ష ఉండేది నాలో. కానీ ... కానీ ... అయినా అన్నీ అనుకున్నట్లు జరగవు. ఎన్ని అనుకున్నాము మనము — జంటగా విడి విడిగా ఎన్ని కలలు కన్నాం! మన పాపను డాక్టరు చేయాలనీ, మరీ అందంగా ఉంటే ఆక్ట్రెస్ చేయాలని ... ఇంకా ఎన్నో! అన్నట్లు పాపను రాజమండ్రి వెంకటేశ్వర్లు మాస్టరు గారి ఇంటివద్ద వదిలేశావని తెలిసింది, నిజమేనా? మనం ఇద్దరం ఉండి కూడా ఎవరూ లేని అనాథగా మారిపోయింది పాప! అదే బాధగా ఉంది నాకు.

వచ్చేస్తాను రాజా, నీ అడ్రసు తెలిసాక ఇక ఇక్కడ ఉండటం నా వల్ల కాదు. పాపను కూడా ఎలాగో తెచ్చేసుకుందాం. రాజారాణుల్లాగ కాలం గడుపుకోవచ్చు. వచ్చే ముందు నీకు మరో ఉత్తరం రాస్తాను.

ఉంటాను మరి —

ఎన్నాళ్లకో మళ్లీ నీ కౌగిలిలో కరిగిపోయే అవకాశం వచ్చింది. ఈ సారి నా సేతను అంత మూర్ఖంగా వదులుకోను.

కొటాలంపూర్. నరసింహం."

దీరంగా నిట్టూర్చింది ఇందిర.

"నిజమేనంటావా?"

"ఇది చూడు" అంటూ డైరీని అందించాను ఇందిరకు.

అది చదివి ఇందిర ఆశ్చర్యపోయింది. మామయ్య రాజమండ్రి వెళ్లటం, ఆ విషయం విచారించటం కూడా జరిగాయి.

"ఇక సందేహం లేదు బావా!"

ఇందిర ఆ మాట అంటుందని నాకు ఇంత క్రితమే తెలుసు. అందుకే నేను ఆశ్చర్యపోలేదు.

కాని, నిశ్చయంగా ఇదేమీ బాగాలేదు, ఇందిరకు ఎందుకువచ్చిందీ అనుమానం? ఎన్ని సుగుణాలకు ఆలవాలం అయింది ఇది!

"బావా—"

తల ఎత్తి చూశాను ఇందిరకేసి. ఇందిర కళ్లల్లోంచి నీరు ధారగా కారుతూంది. ఇప్పుడు ఆ అనుమానం తనకు కలిగినందుకు పశ్చాత్తాప పడుతూందేమో!

కానీ ఇది సమయంకాదు. సమయం ఏనాడో మించి పోయింది. ఈనాడు ఆకులు పట్టుకుంటే లాభం లేదు.

"బావా బట్టలు వేసుకో..."

"ఎందుకు?"

"పోలీసు స్టేషనుకు రావాలి నాతో."

ఆశ్చర్యపోయేను నేను. "ఇందిరా!"

"ఔను బావా! తప్పుచేసిన వాడు శిక్ష ననుభవించాలి."

"కానీ, ఇందూ, మీ నాన్న ..."

"నాన్నే బావా కాదన్నానా? అయినా తప్పు తప్పే మరి? ఆ తల్లి దండ్రులకు పుట్టినందుకు మాకూ శిక్షకావాలి. అంతే!"

ఇందిర అంత నిక్కచ్చిగా మాట్లాడుతూంటే జవాబు చెప్పలేకపోయాను. మౌనంగా లేచి బట్టలు వేసుకున్నాను.

ఇందిర పెట్టెదగ్గిరే దిగాలుగా కూర్చుని ఉంది. నా పని పూర్తికాగానే అన్నాను — "లే, ఇందూ లే!"

ఇందిరలో దుఃఖం కట్టలు తెంచుకొంది. వెక్కివెక్కి ఏడ్వనారంభించింది.

"రాలేను బావా! ఎలా రమ్మంటావు? — నా కంత ధైర్యం ఉందనే అనుకున్నావా? అనుకుంటున్నావా?"

ఏం చేయాలో తోచడం లేదు నాకు.

ఇందిరలో ఇంత బేలతనం ...

క్షణం క్రితం ఇందిరకు, ఈ క్షణంలోని ఇందిరకు ఎంత తేడా!

మనిషి కూడా రంగులు మార్చగలడనేది నాకీ క్షణంలో తెలిసింది.

వీధి తలుపు తట్టిన చప్పుడయింది.

"మామయ్యేమో?"

---

## ఇంద్ర ధనుస్సు

కన్నీటి చుక్కలతో,
కాంతితో తయారైన గొప్ప
వస్తువే ఇంద్ర ధనుస్సు.

—కూల్‌రిడ్జ్

---

"ఆ అయి ఉండరు. ఈ సమయంలో ఎప్పుడూ రాడు." అంది ఇందిర ఎక్కిళ్లను ఆపుకుంటూ.

లేచి వెళ్లి తలుపు తీశాను.

మామయ్య!

ఏమనాలో, ఏమనుకోవాలో తెలియలేదు.

ఏం జరుగుతుందో నని భయం, ఆందోళన, ఉత్కంఠ.

అయినా సాధ్యమైనంత వరకూ నా ముఖంలో భావాలేమీ ప్రతిబింబించకుండా ఉండేట్లు జాగ్రత్త పడ్డాను.

ముందు నడుస్తున్న మామయ్యకు వెనకగా నేను.

ఆ గది ముందుకు రాగానే ఆగిపోయాడు. మామయ్యను చూసి ఆశ్చర్యపోయింది ఇందిర.

నా గుండెల్లో గుండెలు లేవు.

తుఫానుకు ముందుగ ఉండే ప్రశాంత పరిస్థితిలా ఉంది వాతావరణం.

మామయ్య కూడా బహుశా ఈ పరిస్థితిని ఊహించి ఉండడు. తెరిచి ఉంచిన పెట్టె, చిందరవందరగ ఉన్న బట్ట, ఆ ఉత్తరం, ఆ డైరీలు ...

చాలు! —

ఈ కథ చెప్పడానికి ఇంతకన్న వేరేవి అక్కర్లేదు.

"ఆ డైరీ ఇలా అందుకో అమ్మా."

మౌనంగా అందించింది ఇందిర.డైరీని అందుకొన్న వెంటనే అన్నాడు మామయ్య క్షమాపణ చెప్పుకుంటున్నట్లుగ — "డైరీ మరిచిపోయామ్మ, అందుకే వచ్చాను" —

మ్రాన్పడి పోయాను —

ఈ దృశ్యాన్ని చూశాక కూడా మనసులోని భావ సంచలనాన్ని పైకి రాకుండా ఎలా ఆపుకోగలిగాడు?

వీళ్ల మధ్య నేనెంతకాలం గడిపాను. నిజమే!

కానీ, వీళ్ల నెవర్నీ అర్థంచేసుకోలేకపోయాను.

నిజానికి వాళ్లే నాకు అర్థంకాలేదు. నా ప్రయత్న లోపం లేదనిపిస్తోంది.

మనిషిని, ఆ మనిషిలోని భావాలు ఎదుటివాడు తప్పులేకుండా ఏనాటికి అర్థం చేసుకోగలడు?

ఏమో, అయినా ఇలాటి విచిత్ర ప్రకృతి, మానసిక ప్రవృత్తులు ఉన్న మనుషుల మధ్య ఉండటం అంత శ్రేయస్కరం కాదు.

వీళ్ల సమస్యలను వీళ్లకే వదిలివేస్తే, వీళ్ల ఇష్టానుసారం వీళ్లే పరిష్కరించుకొంటారు.

అదే అన్నాను ఇందిరతో —పేలవంగా నవ్వింది ఇందిర.

"అంతే బావా — ఈ లోకంలో ఎవరికి ఎవరూ ఏమీ కాదన్నది మరోసారి బుజువు చేస్తున్నావు. పోనీలే గానీ నాకో సాయం చేస్తావ్, ప్లీజ్?"

"ఏమిటి?"

"ఈ విషయం నాకు తెలియకుండా నువ్వెవ్వరికీ చెప్పకూడదు. సరేనా?"

"సరే—"

"ముఖ్యంగా పోలీసులకు —"

"సరే అంటున్నానుగా — "

ఆ రోజు రాత్రే వెనుదిరిగి వచ్చేశాను నేను.

* * *

వారం రోజులు కూడా సరిగా గడిచాయో లేదో అనుమానమే!

ఆవేళ ...

ఎవరో తలుపు తడుతూంటే మెలకువ వచ్చింది.

బద్ధకంతో వెళ్లి తలుపు తీశాను.

తలుపు తీసేసరికి నిద్ర అంతా దూదిపింజలా ఎగిరిపోయింది.

ఇందిర, ప్రశాంత!

"నాన్నను పోలీసులు తీసుకువెళ్లిపోయార్రా బావా—"

ఇందిరకేసి చూశాను నిజమా అన్నట్లు.

మౌనంగా పర్స్‌లోంచి ఉత్తరంఅందించింది. చదివాను.

"చి. ఇందిరకు,

ఆశీస్సులు. నీకు తెలిసిపోయిందినిజమే నమ్మా.

రాజాను నేను చంపేశాను —

రాజా నన్ను మోసంచేసింది. నిజం ఒప్పుకోనుంటే క్షమించగలిగేవాడినేమో! కానీ, అబద్ధమే చెప్పింది నాతో.

అది క్షమించలేకపోయాను.

నిజమేనమ్మా, తప్పుచేసిన మనిషిని క్షమించగలగటం ఎంత గొప్ప విషయం!

కానీ, క్షమించటంలోనే శిక్షించటం కూడా ఇమిడి ఉందన్న సంగతి నాకు తెలియదు.

నువ్వు నాకు తెలియజేశావు. నేను చేసిన పని నీకు తెలుసు. అయినా దాన్ని క్షమించగలిగావు. కానీ నువ్వు క్షమించటం నాకిష్టం లేదు.

ఈ శిక్షను అనుభవిస్తున్నది మనస్సు. ఇక భరించలేను!

అందుకే నా అంతట నేను వెళ్లి పోలీసులకు లొంగిపోతున్నాను.

నన్నొక్కసారి క్షమించావు. తద్వారా శిక్షించావు, మరొక్క సారి నన్ను క్షమించి, ఈ శిక్ష అనుభవించగలిగే ఆత్మవిశ్వాసం కలిగించు.

వెంకటేశ్వరరావు."

ఉత్తరం చదివాను.

నిజమే, క్షమ కన్న వేరే శిక్ష ఏముంది కనక!

ఇందిర ముందుగా నిలబడి ఉంది.

నా కళ్ల ముందే మానవత్వపు మహోన్నత శిఖరాలను అధిష్ఠించగలిగిన ఆ మనిషిని, అదే, ఇందిరను — నా బాహువులలో ఇముడ్చుకోవడానికి విఫలయత్నం చేశాను. ★